సమస్యలతో సతమతం

- కనీస సౌకర్యాలకు నోచుకోని రాజీవ్ స్వగృహ ఇళ్లు
- వేధిస్తున్న విద్యుత్ సమస్య
- పట్టించుకోని పాలకులు


శ్లాబ్‌లు వేసి అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

ఎచ్చెర్ల : ప్రభుత్వ ఉద్యోగులకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు గతంలో రాజీవ్ స్వగృహ పేరిట ఇళ్లు నిర్మించారు. తక్కువ ధరకు గృహాలను నిర్మించేందుకు 2010లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ద్వారా ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురం పంచాయతీ పరిధిలోని కొండపై 100 ఎకరాల భూమిని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆనమిత్ర టౌన్‌షిప్ పేరిట ఇళ్లను నిర్మించి ఇచ్చింది. అయితే మౌలిక వసతులు కల్పించకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..

ప్రభుత్వ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో 3,500 మంది రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని అప్పట్లో ప్రకటించడంతో జిల్లాలో 5 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలకు అయ్యే ఖర్చులో 25 శాతం దరఖాస్తు దారుడు ముందే చెల్లించాలని, మిగిలింది బ్యాంక్ నుంచి రుణంగా తీసుకుని నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. మొదటి విడతలో 50 ఎకరాల స్థలంలో 500 ఇళ్లు నిర్మించేందుకు ప్లాట్లు వేయగా 54 మంది మాత్రమే 25 శాతం రుసుం చెల్లించి ఇళ్లు సొంతం చేసుకున్నారు. మరో 135 ఇళ్లు పునాదులు, శ్లాబ్‌ల స్థాయిలోనే అసంపూర్తిగా ఉండిపోగా 322 ఇళ్ల స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. 2014లో అప్పటి ప్రభుత్వం వేలం వేసి 175 ఇళ్ల స్థలాలను విక్రయించింది. ఇంకా 147 ఇళ్ల స్థలాలు ఖాళీగానే ఉన్నాయి.

సౌకర్యాలు లేక ఇక్కట్లు..

ప్రస్తుతం నివాసముంటున్న వారికి తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గాలికొదిలేయడంతో రాజీవ్ స్వగృహ ఆనమిత్ర హౌసింగ్ సంక్షేమ సొసైటీ పేరిట సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రతినెలా కొంత నిధులు వేసుకుని వాటితో వీధి దీపాల నిర్వహణ, చార్జీల చెల్లింపులు, మౌలిక సౌకర్యాలు కల్పన వంటివాటికి వినియోగించుకుంటున్నారు.

మూలకు చేరిన రక్షిత పథకం..

ఇక్కడ నివాసాలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటుచేసిన రక్షిత పథకం మూలకు చేరింది. దీంతో ఎవరికివారు బోర్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు హౌస్ మ్యాపింగ్ లేక ఆధార్, రేషన్ వంటి గుర్తింపు కార్డులు పొందేందుకు వీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వాడుకనీరు బయటకుపోయేందుకు సరైన వ్యవస్థ లేదు. చెత్తాచెదారాలను వేసుకోవడానికి డంపింగ్‌యార్డు లేక ఎక్కడ చెత్త అక్కడే నిలిచిపోతోంది. కొండపై నివాసాలు కావడంతో ప్రహరీ, గేటు అవసరం ఉంది. అయినా ఇంతవరకు నిర్మించలేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.


మూలకు చేరిన రక్షిత పథకం


రోడ్లు, వీధి దీపాలు లేని కాలనీ

పనులు జరుగుతున్నాయి..

కాలనీలో సీసీ, బీటీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా కల్పనకు రూ.13.5 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. నవంబర్ నాటికి పూర్తిచేసేలా ప్రయత్నిస్తున్నాం. ఖాళీ స్థలాలకు వేలం వేస్తాం.

– డి.ఎస్.ఆర్. సుధాకర్, జీఎం, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్

క్లుప్తంగా

ఫస్ట్ ఎయిడ్‌తో ప్రాణరక్షణ


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్స చేయడంపై అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, శ్రీకాకుళం జిల్లా శాఖ క్లైమేట్ యాక్షన్ గ్రూప్ రెడ్‌క్రాస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ డే నిర్వహించారు. సీపీఆర్, పాముకాటు, కుక్కకాటు, ఫిట్స్, వడదెబ్బ, కట్లు కట్టడం వంటి అంశాలను విద్యార్థులకు రెడ్‌క్రాస్ ప్రతినిధి గొలివి రమణ వివరించారు. కార్యక్రమంలో సీఏజీ కళాశాల కో–ఆర్డినేటర్ హేమ పద్మజ, డాక్టర్ రవికుమార్, అధ్యాపకులు, యూత్ రెడ్‌క్రాస్, రెడ్‌రిబ్బన్ విభాగాల వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు హిందీ దివాస్ వేడుకలు

శ్రీకాకుళం న్యూకాలనీ : జాతీయ హిందీ పక్షోత్సవం సందర్భంగా హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం నగరంలో హిందీ దివస్ నిర్వహిస్తున్నట్టు హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోనే శ్రీధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కనుగుల సత్యం, రొంపివలస రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 80 ఫీట్ రోడ్డులో ఉన్న బీకేఎస్ జూనియర్ కాలేజీలో ఉదయం 11:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌తోపాటు విద్యవేత్తలు, పలువురు ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులు హాజరవుతారని పేర్కొన్నారు. హిందీ భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వక్తలు మాట్లాడతారని, అనంతరం హిందీ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం, హిందీ పరీక్షలలో ఉత్తీర్ణులైన వారికి ప్రమాణపత్ర వితరణ, సన్మాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. హిందీ టీచర్లు, లెక్చరర్లు, భాషాభిమానులు పెద్ద హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దేశ సేవ పౌరుల బాధ్యత

శ్రీకాకుళం అర్బన్: దేశానికి సేవలందించాల్సిన బాధ్యత పౌరులపై ఉందని జేసీఐ మెయిన్ కార్యదర్శి తమ్మినేని ఉషారాణి అన్నారు. జేసీఐ వారోత్సవాలలో భాగంగా హ్యూమన్ డ్యూటీస్ అండ్ రెస్పాన్స్‌బిలిటీస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు పోషాక్, శ్రీలక్ష్మీ, స్వాతి, పూర్వపు అధ్యక్షురాలు మణిశర్మ, ఉర్లం శివతేజ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ప్రత్యేక రుణాలు


చిత్రా లక్ష్మి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు


జి.సిగడాం: అర్హులైన స్వయం శక్తి సంఘాలకు బ్యాంకు ద్వారా ప్రత్యేక రుణాలను మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చిత్రా లక్ష్మి అన్నారు. శనివారం సంతవురిటిలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే స్త్రీనిధి ద్వారా అర్హులైన సంఘ సభ్యులకు రుణాలను మంజూరు చేశామన్నారు. వీటి ద్వారా మహిళలకు జీవనోపాధి మెరుగవుతుందన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

రణస్థలం: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు మెమో–57 ప్రకారం పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం రణస్థలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్సీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీను, మండల కన్వీనర్ కె.శ్రీధర్, సంఘ నాయకులు జి.చిన్నకృష్ణంనాయుడు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



జి.సిగడాం ఆనందపురంలో ప్రజల దాహార్తిని తీర్చే వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ఇదే ప్రాంతంలో చిన్నారులు తిరుగుతుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

వృథాగా మోడల్ గోదాం



ఎచ్చెర్లలోని సివిల్ సప్లయ్ గోదాం నిరుపయోగంగా మారింది. మోడల్ గొడౌన్ పేరిట ఇక్కడ ఈ భవనం నిర్మించారు. ఇంతవరకు ప్రారంభించకుండా వదిలివేశారు. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారింది.

– ఎచ్చెర్ల

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



వెల్బురాయి గ్రామంలో కారిచెరువు పొలంలో విద్యుత్ స్తంభం వాలిపోయి వారం రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– రణస్థలం

మురికి కూపం.. ఎవరిదీ పాపం.?



ఓ వైపు వానలు కొనసాగుతున్నాయి. మరో వైపు జ్వరాలు వణికిస్తున్నాయి. ఇలాంటి ఆపత్కాలంలోనూ అధికార యంత్రాంగం అలసత్వం వీడడం లేదు. జేఆర్‌పురం పంచాయతీలోని వెంకటేశ్వర కాలనీ మురికి కూపాన్ని తలపిస్తోంది. వర్షపు నీరు, మురుగు నీరు వెళ్లే దోవ లేకపోవడంతో నీరు నిలిచిపోతుంది. నిల్వ ఉన్న నీరు దోమలకు ఆవాసంగా మారి జ్వరాలు ప్రబలుతున్నాయి.

– రణస్థలం

నారాయణ తిరుమల ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేటలో నారాయణ తిరుమల కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం నూతన ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ సమక్షంలో నూతన కమిటీ సభ్యులు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులను ట్రస్టుబోర్డు చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ట్రస్టు సభ్యులుగా మద్ది భానుమతి, కె.శ్రీనివాసరావు, ఎ.గోవిందరావు, శిల్లా రాధిక, జె.అరుణ, కె.నాగరాజు, బి.సాయమ్మలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, జామి భీమశంకర్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న చందక సతీష్

జి.సిగడాం:

ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు పంపిణీ చేయాలని వైఎస్సార్ సీపీ నేత, ముషినివలస సర్పంచ్ చందక సతీష్ అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో యూరియా బస్తా కోసం రైతన్నలు నానా పాట్లు పడుతున్నారని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో అన్నదాతల ఇంటి ముంగిటికే ఎరువులు, విత్తనాలు వచ్చేవని గుర్తు చేశారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు కుమరాపు సన్యాసప్పలనాయుడు, కుమరాపు శ్రీనివాసరావు, రైతులు ఉన్నారు.

కదంబ పుష్పాలతో అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని పాలకొండరోడ్డులో ఉన్న విజయగణపతి ఆలయంలో స్వామివారిని కదంబ పుష్పాలతో శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సుర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు.

వెంకన్నకు విశేష పూజలు


పూజలందుకుంటున్న నారాయణ తిరుమల వేంకటేశ్వరుడు


మొండేటివీధిలో వెంకన్నకు పూజలు

శ్రీకాకుళం కల్చరల్ : నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకట రామానుజ సేవాళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. చిన్న బజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. మొండేటివీదిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

విశ్రాంత ఇంజినీర్లకు సన్మానం


రిటైర్డ్ ఇంజినీర్లను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బొందిలీపురంలో శనివారం నీటి పారుదల శాఖ రిటైర్డ్ ఇంజినీర్ల జిల్లా సంఘం ఆధ్వర్యంలో 70 ఏళ్లు దాటిన విశ్రాంత ఇంజినీర్లు ఎం.ప్రభాకరరావు, సీఎం.ప్రసాద్, ఎస్.అప్పారావు, టి.కృష్ణారావులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బి.సూర్యనారాయణ మాట్లాడుతూ వృత్తిలో ప్రవృత్తిలో బి.ఎ.మోహన్‌రావు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు జి.ప్రభాకరరావు, ఎస్.హోమేశ్వరరావు, కోశాధికారి కె.ఆర్.సి.ప్రసాద్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన


ఆర్ఎంపీలకు సర్టిఫికెట్లు అందిస్తున్న డాక్టర్ శశిధర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అత్యవసర పరిస్థితుల్లో అందించే ప్రథమ చికిత్స వ్యక్తి ప్రాణాలు కాపాడుతుందని డాక్టర్ శశిధర్ అన్నారు. వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, డాక్టర్ శశిధర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం పీఎంపీలకు ప్రథమ చికిత్స, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కె.కిషోర్, జనరల్ సర్జన్ డాక్టర్ సీహెచ్.గోవిందరావు, జిల్లా అధ్యక్షులు వండాన శిమ్మన్న, కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, ట్రెజరర్ కె.జనార్దనరావు, సహాయ కార్యదర్శి చిన్నాల రాము, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాల్గొన్నారు.

యోగాచార్య రామారావుకు సత్కారం


రామారావు మాస్టారును సత్కరించిన యోగా బృందం

శ్రీకాకుళం కల్చరల్ : జిల్లాలో యోగ విద్యకు ప్రాణంపోసిన గొప్ప వ్యక్తి యోగాచార్య రామారావు మాస్టారు అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బలగ కాలభైరవ స్వామి దేవాలయంలో రామారావును శనివారం సత్కరించారు. కాలభైరవ పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రీ గురుకుల్ అధినేత వాణీ సుకన్య మాట్లాడుతూ మహిళలకు ఉచిత విద్య, ఉపాధి ఆధారిత శిక్షణ ఇస్తున్నామని, రామారావు మాస్టార్ ద్వారా యోగాలో ఎన్నో మెలకువలు నేర్చుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో రచయిత సుబ్రహ్మణ్యం, విశ్రాంత న్యాయమూర్తులు పప్పల జగన్నాథం, సింగయ్య, కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలి

ఎచ్చెర్ల : చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు శనివారం కెరీర్ గైడెన్స్, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఐఏసీఐ(విశాఖ) ట్రైనర్ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులకు మార్గదర్శకాలు అందించారు. సమయపాలన, లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.టి.చంద్రశేఖర్, బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విశాఖ–ఏ కాలనీలో నూతనంగా నిర్మించబోయే నీలమణి దుర్గాదేవి ఆలయ నిర్మాణం కోసం శనివారం పలువురు దాతలు విరాళాలు అందించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా కాలనివాసులు నిర్వహించిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి చోటా గుడి, బడి నిర్మించుకోవడం ఎంతో పుణ్యఫలమన్నారు. అనంతరం ఓ దాత రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే చేతులమీదగా కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పాండ్రంకి శంకర్, శింతు సుధాకర్, అంధవరపు సంతోష్, ప్రసాద్, పి.ఎం.జె.బాబు, ప్రధాన విజయరాం, పాండ్రంకి దేవేంద్రనాయుడు పాల్గొన్నారు.

మానవత్వంతో సేవలందించాలి

శ్రీకాకుళం అర్బన్: మానవత్వంతో సమాజాని సేవ చేయాలని జేసీఐ సన్‌రైజర్స్ జిల్లా అధ్యక్షుడు సింగూరు ప్రవీణ్ అన్నారు. జేసిఐ వీక్ ప్రిజమ్ 110లో భాగంగా శనివారం హ్యూమన్ డ్యూటీస్ అండ్ పిటిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ డ్యూటీస్ పిటిషన్‌పై ప్రజల సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ దూసి సంతోష్, జోన్ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, లోలుగు ఈశ్వరరావు, శ్రీను, ఆచార్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మహిళా పోలీసుస్టేషన్ సీఐ


ఎస్పీతో సీఐ రామారావు

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన వి.రామారావు శనివారం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళలు, యువతులు, బాలికల సమస్యలపై సత్వరమే స్పందించాలని ఎస్పీ సీఐకి సూచించారు.

రాయితీపై మత్స్య పరికరాలు

రణస్థలం: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా 50 శాతం రాయితీపై వేటకు సంబంధించిన ఉపకరణాలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు శనివారం పంపిణీ చేశారు. జీరుపాలెంలో మత్స్యకార లబ్ధిదారులు 43 మందికి వీటిని అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.